# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




## కలెక్టర్ సార్‌కు కృతజ్ఞతలు

- కలెక్టర్ చొరవతో భూ సమస్యకు పరిష్కారం

2

సంపుటి : 01 | సంచిక : 193 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 16 జూన్ 2026 | పేజీలు : 4



# పరిశోధన రంగాల్లో ‘నైపర్’ కీలక పాత్ర

- ఖాళీల భర్తీపై చర్యలు అవసరం
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ, మనచౌరాస్తా :** నైపర్ కౌన్సిల్ మూడో సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశంలోని ఔషధ విద్య, పరిశోధన రంగాల్లో నైపర్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, అన్ని నైపర్‌లలో ఐదేళ్ల పదవీకాలంతో రెగ్యులర్ రిజిస్ట్రార్లను నియమించాలని కోరారు. హైదరాబాద్ నైపర్‌లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కొనసాగడం సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందన్నారు. పరిపాలనా ఖాళీలను వెంటనే భర్తీ చేసి, విద్యార్థుల ఉపాధి అవకాశాలను బలోపేతం చేయాలని సూచించారు. గవర్నింగ్ బోర్డుల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం చట్టబద్ధమేనా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని, కొత్త బోర్డుల నియామకాన్ని వేగవంతం చేయాలని కోరారు. బయోశక్తి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన జాతీయ బయోఅవైలబిలిటీ కేంద్రాల పనితీరు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేశ ఫార్మా రాజధానిగా ఉన్న హైదరాబాద్‌కు ఈ రంగంలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నైపర్‌లలో ఏర్పాటు చేసిన అత్యుత్తమ కేంద్రాల సంఖ్య, పనితీరు, పరిశ్రమలకు అందిస్తున్న సేవలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు. వికసిత భారత్ 2047 లక్ష్యాలు, తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్య సాధనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలకమని తెలిపారు. అదేవిధంగా మొహాలీ నైపర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రఘురాం రావు అక్కినేపల్లి అంశాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి, ఆయనకు న్యాయం చేయాలని కోరారు.

## రోడ్డు యాక్సిడెంట్ల నివారణకు చర్యలు



2 లో





# wanted

## విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way




3 లో

## సర్కారు బడిలోనే అన్ని సౌలత్‌లు

# రోడ్డు యాక్సిడెంట్ల నివారణకు చర్యలు

**– కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను మెరుగుపరచి, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రహదారి భద్రత సమీక్ష సమావేశంలో ఉప పోలీసు కమిషనర్ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని జాతీయ రహదారులపై భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గోవర్ధనగిరి కూడలి వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు అనుకూలంగా పైవంతెన వద్ద భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. నెల్లుట్ల ప్రాంతంలో రహదారి భద్రత సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రఘునాథపల్లి జాతీయ రహదారిపై వర్షపు నీరు నిల్వ కాకుండా నీటి పారుదల సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని జాతీయ రహదారి-163 పరిధిలో సంయుక్త తనిఖీలు నిర్వహించామని, రహదారి వెంట భద్రతా సూచికలు, మార్గ గుర్తులు, హెచ్చరిక గుర్తులు, మధ్య విభజన అవరోధాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాఠశాల బస్సుల యోగ్యత పరీక్షలను త్వరగా పూర్తి చేయాలని, ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు సహాయకుడు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రతి బస్సులో నిఘా చిత్రీకరణ పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రహదారులు-భవనాల శాఖ అధికారులు, మద్యం నియంత్రణ శాఖ అధికారి అనిత, జిల్లా వైద్యాధికారి మల్లికార్జున రావు, రవాణా శాఖ ప్రతినిధులు, జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, జాతీయ రహదారి అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పెంబర్తి విశ్వకర్మ సంక్షేమ సంఘం ఎన్నిక

**అధ్యక్షుడిగా అయిలా కృష్ణమాచారి**

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా పెంబర్తి విశ్వకర్మ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అయిలా కృష్ణమాచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మల్యాల జనార్ధనాచారి, ప్రధాన కార్యదర్శిగా రంగు నర్సింహాచారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అనంతోజు బ్రహ్మచారి, నిర్వహణ కార్యదర్శిగా అయిలా మాధవాచారి, ప్రచార కార్యదర్శిగా అయిలా సోమనర్సింహాచారిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అయిలా రాజేష్, గుడికందుల జగన్, గౌరవ సలహా సభ్యులుగా రంగు లక్ష్మణాచారి, అయిలా వేదాంతాచారి, కూరోజు సంపతాచారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందించి సన్మానించారు. పూర్వ కమిటీ సభ్యులకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ సత్కరించారు. అనంతరం నూతన కమిటీ తొలి సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు.

## కలెక్టర్ చొరవతో

## భూ సమస్యకు పరిష్కారం



**జనగామ, మన చౌరాస్తా:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూమి వివాదానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో పరిష్కారం లభించింది. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వినతి సమర్పించిన జనగామ మండలం శామీర్పేట్ గ్రామానికి చెందిన బదుక రాంచందర్‌కు న్యాయం జరిగింది. రాంచందర్ కు చెందిన 23 గుంటల భూమి కొన్ని సంవత్సరాల క్రితం అక్రమంగా తన అన్న బిడ్డ పేరు మీదకు బదిలీ కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. గత నెల ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా, కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత రెవెన్యూ అధికారులకు సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు భూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవడంతో తనకు న్యాయం జరిగిందని రాంచందర్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు ముగింపు రావడం కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందన్నారు. ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడంలో కలెక్టర్ చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొంటూ, సందీప్ కుమార్ ఝాకు రాంచందర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా సామాన్యులకు త్వరిత న్యాయం అందుతోందనే విశ్వాసం మరింత బలపడిందన్నారు.





# కేబుల్ టీవీ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలోని కేబుల్ టీవీ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు, కేబుల్ టీవీ నిర్వాహకుల సమస్యలు, అక్రిడిటేషన్ అంశాలు, సాంకేతిక మార్పుల నేపథ్యంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణపై చర్చించేందుకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేబుల్ టీవీ రంగానికి సంబంధించిన పలు కీలక సమస్యలపై చర్చించారు. కేబుల్ టీవీ ఛానళ్లలో పనిచేస్తున్న ప్రతి నియోజకవర్గ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డిజిటల్ సాంకేతికతతో రంగంలో వస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకుని కేబుల్ టీవీ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీలో కేబుల్ టీవీ రంగానికి ప్రాతినిధ్యం కల్పించి, ప్రతి జిల్లాలో కేబుల్ టీవీ ప్రతినిధిని అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు విరాహత్ అలీ, మారుతి సాగర్, తెలంగాణ



డిజిటల్ కేబుల్ టీవీ జనగామ జిల్లా అధ్యక్షులు మరెడీ వినయ్ కుమార్ తో పాటు అసోసియేషన్ ప్రతినిధులు, పలు జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోదీ 12 ఏళ్ల పాలన దేశాభివృద్ధికి నిదర్శనం

**– కాసం వెంకటేశ్వర్లు**



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12 సంవత్సరాల సుపరిపాలన వికసిత్ భారత్ సంకల్ప సమ్మేళనం మేధావుల సదస్సులో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన నమ్మకం, వికాసం, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిందన్నారు. 58 కోట్లకు పైగా జనధన్ ఖాతాలు, 4 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం, 15.85 కోట్ల తాగునీటి అనుసంధానాలు, 44 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డుల జారీ ద్వారా అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. 2014కు ముందు అవినీతి, నిలిచిపోయిన ప్రాజెక్టులు కనిపించేవని, నేడు పారదర్శక డిజిటల్ చెల్లింపులు, వందే భారత్ రైళ్లు, వేగవంతమైన రహదారులు, భవ్య రామమందిర నిర్మాణంతో దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని తెలిపారు. రైతులకు అండగా, యువతకు ఉపాధి కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తెలంగాణలో ధాన్యం కొనుగోలు, ఎయిమ్స్, ములుగు కేంద్ర విశ్వవిద్యాలయం, రామగుండం ఎరువుల కర్మాగారం, జాతీయ రహదారులు, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, వస్త్ర పార్కు, జహీరాబాద్ పారిశ్రామిక పార్కు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వమే చేపట్టిందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

**– కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, మన చౌరస్తా: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సమస్యలపై అధికారులు సానుకూల దృక్పథంతో స్పందించాలని, అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. దరఖాస్తులను వర్గీకరించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

## వినతులు ఇవీ..

బచ్చన్నపేట మండలం బండనాగారం గ్రామానికి చెందిన యు. రాజు, బండనాగారం నుంచి లద్నూర్ వరకు ఉన్న దారిని రైతులు మూసివేశారని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. జనగామకు చెందిన బచ్చు బాలనారాయణ ఇంటి నిర్మాణానికి మొరం అనుమతి త్వరగా మంజూరు చేయాలని వినతి సమర్పించారు. రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామస్థులు కర్ణాలకుంట చెరువు కట్టపై ముళ్ల చెట్లు తొలగించి స్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. బండనాగారం గ్రామానికి చెందిన డి. సురేష్, ప్రభుత్వ పాఠశాల గేటు వద్ద నిర్మించిన మంగలి డబ్బా వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయ



ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఏ. ఆశారాణి తెల్ల రేషన్ కార్డు ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రంగారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృనాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇండ్ల ఇసుక గెస్ట్ హౌస్‌కు..

## చీటకోడూరు సర్పంచ్‌పై గ్రామస్తుల ఫిర్యాదు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా చీటాకోడూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం కేటాయించిన ఇసుకను గ్రామ సర్పంచ్ కూకట్ల యాదగిరి తన ట్రాక్టర్ ద్వారా అక్రమంగా తరలించి ప్రైవేట్ గెస్ట్ హౌస్ నిర్మాణానికి వినియోగించారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో నమోదైందని, పలువురు ప్రత్యక్ష సాక్షులు ఉన్నారని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.






# ప్రభుత్వ పాఠశాల లో మౌలిక వసతులు

**తహసీల్దార్ సూత్రం సరస్వతి**

**పాలకుర్తి, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, సకల సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని తహసీల్దార్ సూత్రం సరస్వతి అన్నారు. జూన్ 15 న నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా పాలకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆహ్వాన కార్యక్రమం , నూతన LPG గ్యాస్ కనెక్షన్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవం వేడుకలకు తహసిల్దార్ సూత్రం సరస్వతి , MEO పోతుగంటి నర్సయ్య , గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ , పాఠశాల AAPC చైర్మన్ దేశ బోయిన శ్రీలత గారి చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ సంవత్సరం 10వ తరగతిలో మండల టాపర్ దేశబోయినమానస (MPPS పాలకుర్తి పాఠశాల పూర్వ విద్యార్థి) ని సన్మానించారు. తాసిల్దార్ సూత్రం సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వున్న మౌలిక సదుపాయాలు అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేయాలని కోరారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్‌కు 'టీఎస్‌జేయూ' వినతిపత్రం

**కరీంనగర్, మన చౌరాస్తా :** జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, హెల్త్ కార్డుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీ.అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎన్ఓసీలు మంజూరు చేయలేదని తెలిపారు. వెంటనే ఎన్ఓసీలు జారీ చేసి, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ కార్డులు అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, రాష్ట్ర నాయకులు సంపత్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సురేష్, కోశాధికారి సూదుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పడకంటి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, జాయింట్ సెక్రటరీలు సతీష్, ఆవుల శ్రీనివాస్, ఈసీ సభ్యుడు చింతం వెంకటేష్, యూనియన్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గ ఎన్నిక

ఇటీవల నిర్వహించిన టీఎస్‌జేయూ జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా బొడిగె సురేష్, కోశాధికారిగా సూదుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా పడకంటి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్, జాయింట్ సెక్రటరీలుగా సతీష్, ఆవుల శ్రీనివాస్, ఈసీ సభ్యుడిగా చింతం వెంకటేష్ ఎన్నికైనట్లు ప్రకటించారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**